AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

2-1-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## గెజిటెడ్ అధికారుల క్యాలెండర్ ఆవిష్కరణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కామారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఆర్ దేవేందర్, ప్రధాన కార్యదర్శి సాయి రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజలింగం, కోశాధికారి భూమయ్య, సంతోషి రెడ్డి, డాక్టర్ నిజాం, రమేష్, తురాబుద్దీన్, జ్యోతి, మౌనిక, ప్రశాంత్ రెడ్డి, ఠాగూర్, శశికిరణ్, సవితారెడ్డి, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కామారెడ్డిలో వెహికిల్ పార్కింగ్ షెడ్‌ను ప్రారంభించిన ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా పోలీస్ కార్యాలయంలోని వాహన విభాగంలో నూతనంగా వాహనాల పార్కింగ్ షెడ్డును నిర్మించారు. ఈ షెడ్‌కు ఎస్పీ రాజేష్ చంద్ర శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న పోలీస్ వాహనాలు ఎల్లవేళలా సిద్ధంగా ఉండేలా, క్రమబద్ధంగా నిలిపి ఉంచేలా షెడ్‌ను నిర్మించినట్లు తెలిపారు. వర్షం, ఎండ తదితర వాతావరణ పరిస్థితుల్లో పోలీస్ వాహనాలు భద్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పోలీస్‌శాఖ సమర్థవంతంగా సేవలందించే విషయంలో వాహనాల భద్రత కూడా ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ వాహనాలు తక్షణమే అందుబాటులో ఉండడం చాలా ముఖ్యమని, అందుకే వాహనాలు నిలిపే సముదాయ షెడ్డు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, మోటార్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భీమ్‌గల్ మండల సర్పంచుల ఫోరం ఎన్నిక



**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన సర్పంచుల సమావేశంలో ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. ఫోరం మండల అధ్యక్షుడిగా పిప్రి గ్రామ సర్పంచ్ అరిగెల జనార్దన్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా శ్రీరాం అర్వింద్ (బాబానగర్), బుర్ర దేవేందర్ గౌడ్ (పురానీపేట్), ఉపాధ్యక్షుడిగా భూక్యా రమేష్ (సికింద్రాపూర్ తండా), ప్రధాన కార్యదర్శిగా పిండి అశోక్ (పల్లికొండ), కార్యదర్శిగా దుమాల రాజు (చేంగల్), కోశాధికారిగా సమీర్ (బాబాపూర్) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. సర్పంచుల హక్కుల సాధన కోసం, గ్రామ అభివృద్ధిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. సర్పంచుల సంక్షేమమే ధ్యేయంగా ఫోరం పని చేస్తుందని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు వన్నెల జనార్దన్, చరణ్ గౌడ్, గడాల ప్రసాద్, కార్తీక్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నూతన సర్పంచులకు సన్మానం

**అక్షరటుడే, ఆర్మూర్:** నూతనంగా ఎన్నికైన ఆర్మూర్ ప్రాంతంలోని సర్పంచులను రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో కోటపాటి నరసింహ నాయుడు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి ఒక్కరిని తమ కుటుంబ సభ్యులుగా కలుపుకొని పోయి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

తక్కువ కాలంలో భారీగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో పలువురు ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారు. అనంతరం అప్పుల బారిన పడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈజీ మనీ కోసం వీటిని ఆడడం ప్రారంభిస్తున్నారు. అనంతరం డబ్బులు పోవడంతో.. అప్పులు చేసి మరి అందులో పెడుతున్నారు. తీరా చేసిన అప్పులు తీర్చలేక తనువు చాలిస్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఈ తరహా ఘటనలు, సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయి. పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నా యువతలో మార్పు కనిపించడం లేదు.

- అక్షరటుడే, కామారెడ్డి



# ప్రాణాలు తీస్తున్న ఆన్‌లైన్ గేమ్స్

▸ ఈజీ మనీ కోసం యువత ఆరాటం ▸ అప్పు చేసి మరీ ఆడుతున్న వైనం ▸ అప్పులు తీర్చలేక ఆత్మహత్యల బాట ▸ రోడ్డున పడుతున్న కుటుంబాలు

పిల్లలు బాగా చదువుకొని తమకు ఆసరాగా నిలుస్తారని ఆశిస్తున్న తల్లిదండ్రులకు కొందరు యువకులు తీరని శోకాన్ని మిగులుస్తున్నారు. ఈజీగా మనీ సంపాదించాలని కలలు కంటున్నారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు చూసి మోసపోతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్‌కు బానిసలుగా మారుతున్నారు. ఒక్కసారి వాటికి అలవాటు పడ్డాక ఆ ఊబిలో నుంచి బయట పడలేక పోతున్నారు. అందులో డబ్బులు పోతే.. వాటిని తిరిగి రాబట్టుకోవాలని, అప్పులు చేసి మరీ ఆడుతున్నారు. తీరా అప్పులు పెరిగిపోవడం, ఇచ్చిన వారు తిరిగి అడగడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

### మొదట్లో వచ్చినా..

ఆన్‌లైన్ గేమ్స్‌లలో చాలా రకాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం వీటిని నిషేధించిన ఇంకా కొనసాగుతున్నాయి. రూ.500 పెట్టి గేమ్ ఆడితే రూ.వేలు సంపాదించవచ్చని గేమింగ్ యాప్‌లు ఆకర్షించే ప్రకటనలు ఇస్తున్నాయి. వీటిని చూసి యువత మోసపోతున్నారు. తొలుత తక్కువ మొత్తం పెట్టి గేమ్స్ ఆడుతున్నారు. అయితే మొదట్లో ఆయా యాప్‌ల్లో లాభాలు వస్తున్నాయి. అనంతరం దానికి అలవాటు పడిన తర్వాత మొత్తం డబ్బులు పోతున్నాయి. అయినా కానీ వాటికి బానిసలుగా మారిన వారు బయట పడలేక అప్పులు చేసి కుటుంబాలను రోడ్డు మీదకు తెస్తున్నారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్స్ ద్వారా మోసపోతున్న వారిలో యువతతో పాటు ఉద్యోగులు సైతం ఉన్నారు. అన్నీ తెలిసిన ఉద్యోగులు సైతం లక్షల రూపాయలు పోగొట్టుకున్న ఘటనలు ఉన్నాయి.

### ఆస్తులు అమ్మి..

జిల్లాలో ఎంతో మంది ఆన్‌లైన్ గేమ్స్‌కు బలయ్యారు. చాలా మంది అప్పులు చేసి కుటుంబాలను రోడ్డు మీదకు తెచ్చారు. కొందరు తల్లిదండ్రులు ఆస్తులు అమ్మి తమ పిల్లలు చేసిన అప్పులు కట్టేస్తున్నారు. అయితే కొందరు యువకులు మాత్రం అప్పుల భారం పెరగడంతో ప్రాణాలు తీసుకుంటున్నారు. దీంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంటుంది. చేతికి వచ్చిన పిల్లలు చనిపోవడంతో తల్లిదండ్రులు మనోవేదనకు గురి అవుతున్నారు.

### పోలీసులు హెచ్చరిస్తున్నా..

బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్‌ల జోలికి వెళ్లొద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. సోషల్ మీడియా, పత్రికలు, కళాజాత బృందాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. కళాశాలలు, పాఠశాలల్లో సైతం అవగాహన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నారు. అయినా పలువురు యువకులు అత్యాశకు పోయి అప్పుల పాలు అవుతున్నారు. అనంతరం ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

### కామారెడ్డిలో యువకుడు

కామారెడ్డి పట్టణంలోని ఓంశాంతి కాలనీకి చెందిన వల్లందేసి శ్రీకర్ (30) ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి దాదాపు రూ.20 లక్షల వరకు అప్పు చేశాడు. విషయం తెలిసిన తల్లి ఇల్లు అమ్మి అప్పు చెల్లించింది. అయినా ఇంకా ఎంత వరకు అప్పు ఉన్నాడో తల్లికి తెలియదు. గురువారం తల్లి ఇంట్లో లేని సమయంలో అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆన్‌లైన్ గేమ్ వల్ల చేసిన అప్పులు తీర్చలేక తన కొడుకు చనిపోయాడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.

### కుటుంబ సభ్యులు గమనించాలి



చాలా మంది ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నారు. తీరా అప్పులు చేసి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆరుబయట జూదం ఆడితే పట్టుకోవచ్చు. మొబైల్‌లో సీక్రెట్‌గా ఆడితే పట్టుకోవడం కష్టం. దీనికి అవగాహన కల్పించడమే ఏకైక మార్గం. దీంతో పాటు తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను గమనిస్తూ ఉండాలి. భార్యలు కూడా భర్తలు ఆన్‌డబ్బులను దేనికి ఖర్చు చేస్తున్నారు అనేది తెలుసుకోవాలి. దీంతో ఆన్‌లైన్ గేమ్స్ అరికట్టే అవకాశాలున్నాయి. ఈ విషయమై పోలీస్ శాఖ తరఫున మరింత అవగాహన కల్పిస్తాం. - రాజేశ్ చంద్ర, కామారెడ్డి ఎస్పీ

## ఎస్‌హెచ్‌వోపై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణ ఎస్‌హెచ్‌వోపై మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన పచ్చుక రాజేశ్వర్ హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు రాజేశ్వర్ మాట్లాడుతూ.. తన వ్యవసాయ భూమి విషయంలో కొందరు తనపై దాడి చేసిన విషయాన్ని ఆర్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే ఫిర్యాదును తీసుకోకపోగా.. తనపైనే తప్పుడు ఆరోపణలు చేస్తూ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తనను పోలీస్ స్టేషన్‌కు పిలిచి ఒకరోజు నిర్బంధించారన్నారు. దుర్భాషలాడుతూ విచక్షణారహితంగా కొట్టారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు తక్షణమే ఎస్‌హెచ్‌వోను సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాట్లాడుతూ.. ఒకవైపు కోదాడ నియోజకవర్గంలో మాదిగ యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ విషయం మరవకముందే ఆర్మూర్‌లో ఎలాంటి కేసు లేకున్నప్పటికీ అనుమానితుడనే పేరుతో రాజేశ్వర్‌ను ఎస్‌హెచ్‌వో చిత్రహింసలు పెట్టడం దురదృష్టకరమన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## ఓటరు జాబితాలో అన్నీ తప్పులే..: బీజేపీ జిల్లా అధ్యక్షుడు

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో విడుదల చేసిన ఓటరు జాబితా తప్పులతడకగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి వాపోయారు. ఈ మేరకు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విడుదల చేసిన ఓటరు జాబితా డ్రాఫ్ట్‌లో ఇతర నియోజకవర్గ, జిల్లాల ఓటర్లు ఉండడం ఆశ్చర్యకరమన్నారు. కార్పొరేషన్ పరిధిలో 3.45 లక్షల ఓట్లకు గాను.. 3.90 లక్షల ఓట్లు చూపించడం సరికాదన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో ఓట్లు సరిగానే ఉన్నాయని, కానీ వార్డుల వారీగా పరిశీలిస్తే పూర్తి తప్పులు తడకగా ఉందని వివరించారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఓట్ల ఎన్నికల్లో కూడా ఎటువంటి పొరపాట్లు జరగలేదన్నారు. కానీ ప్రస్తుతం విడుదల చేసిన వార్డుల వారి జాబితాలో ఎందుకు తప్పులు దొర్లాయని ప్రశ్నించారు. ఇందూరులో మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందన్న భయంతోనే ఇలాంటి అక్రమాలకు తెరతీస్తున్నారని దినేష్ కులాచారి ఆరోపించారు. ఒక డివిజన్‌లో ఉండాల్సిన ఓటర్లు మరో డివిజన్లకు ఉండడం, ఇతర జిల్లాల వ్యక్తులు ఇక్కడ ఉన్నారన్నారు. సమస్యను ఎంపీ అర్వింద్, రాష్ట్ర



అధ్యక్షుడు రాంచందర్ రావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతనకర్ లక్ష్మీనారాయణ, నాగోల్ల లక్ష్మీనారాయణ, మాజీ కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

**అక్షరటుడే, కామారెడ్డి :** గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఈ మేరకు రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలో శుక్రవారం పర్యటించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లబ్ధిదారుడు నిర్మించుకుంటున్న ఇంటిని పరిశీలించారు. ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చు, తీసుకున్న రుణ వివరాలు, దశల వారీగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధుల కేటాయింపు పరిస్థితిపై సమీక్షించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, నాణ్యతతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో డ్రెయినేజీ, రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు పనులను పరిశీలించారు. గ్రామంలో పరిశుభ్రత, పారిశుధ్య పరిస్థితులను మెరుగుపర్చేందుకు చేపడుతున్న చర్యలను గమనించి, సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా పనిచేయాలంటే పిచ్చిమొక్కలు, చెత్తను పూర్తిగా తొలగించాలన్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కల తొలగింపుతో పాటు నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం గిద్ద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుపై మరింత శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని రిజిస్టర్లు, స్టోర్‌రూమ్‌ను పరిశీలించారు. ఆయన వెంట ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, ఆర్డీవో వీణ, డీఈవో రాజు, తహశీల్దార్ ఉమలత, ఐసీడీఎస్ సిబ్బంది ఉన్నారు.

## భీమ్‌గల్ మండలాభివృద్ధికి చొరవ చూపాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్ మండల అభివృద్ధికి చొరవ చూపాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు మండలస్థాయి అధికారులను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భీమ్‌గల్ తహశీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో గంగుల సంతోష్, భీమ్‌గల్ సీఐ సత్యనారాయణలను వారు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. అలాగే, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై తిరుపతి, ఏవో లావణ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కుప్‌గల్ సర్పంచ్ నర్సింగ్ రావు, ఎంజీ తండా సర్పంచ్ గణేష్, చేంగల్ ఉప సర్పంచ్ మోహన్ గౌడ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సయ్య, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు తోట గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి బిర్రు రామకృష్ణ, సీనియర్ నాయకులు సంధ్య రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు శెట్టి ప్రేమ్‌చంద్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు వెంకటేష్, హరి ప్రసాద్, కుండల అన్వేష్, దేవేందర్ పాల్గొన్నారు.

## సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన బొబ్బిలి రామకృష్ణ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కొత్త సంవత్సరం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని నిజామాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ ఆఫీస్‌లో పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌తో కలిసి సీఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించింది.

## పాఠశాలల ఆకస్మిక తనిఖీ




**అక్షర టుడే బాల్కొండ:** మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ శుక్రవారం పలు పాఠశాలలను తనిఖీ చేశారు. బస్సాపూర్ ప్రాథమిక పాఠశాల, కిసాన్‌నగర్ ప్రాథమిక పాఠశాల, బాల్కొండ భవిత సెంటర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కిసాన్‌నగర్ తదితర పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, గ్రంథాలయం, ఎఫ్‌ఎల్‌ఎస్, మధ్యాహ్న భోజనం, కిచెన్ గార్డెన్ తదితర అంశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల పఠన సామర్థ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణవేణి, బోయడ నర్సయ్య, రాజేష్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అద్విక కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని పోతాయిపల్లికి చెందిన సంఘ గౌడ్ కుమార్తె అద్విక (7) తీవ్ర అనారోగ్యంతో 15 రోజులుగా హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాలిక తండ్రి సీఆర్‌పీగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఇప్పటివరకు సుమారు రూ.10లక్షలు ఖర్చయ్యాయి. ప్రస్తుతం వారివద్ద డబ్బులు లేకపోవడంతో ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తూ లింగంపేటకు చెందిన హైకోర్టు అడ్వకేట్ మోహిన్ మహమ్మద్ ఖాద్రికి చరవాణిలో సంప్రదించారు. దీంతో స్పందించిన ఆయన శుక్రవారం బాలిక ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.25,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ మైనారిటీ కార్యదర్శి రఫీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసిఫ్, వార్డు సభ్యులు గుండా బాలకిషన్, కుమ్మరి రాజు, రాజు, మారుతి, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

## గిరిజన సర్పంచ్‌లకు సన్మానం




**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని నూతనంగా ఎన్నికైన గిరిజన సర్పంచ్‌లను ఏఐబీఎస్‌ఎస్ అధ్యక్షుడు బొట్టు మోతీరాం శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల తండాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



**నగరంలోని బోర్గాం(పి) మొటాటిరెడ్డి కల్యాణ మండపం క్యాలెండర్లను శుక్రవారం ఆవిష్కరించారు. మండపం కమిటీ అధ్యక్షుడు చామకూర సాయరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.** –అక్షరటుడే, ఇందూరు

**గ్రామానికి సర్పంచ్ ప్రథమ పౌరుడు. రాజ్యాంగంలోని 73వ సవరణ ద్వారా పంచాయతీలకు ప్రత్యేక అధికారాలు, విధులు, హక్కులు కల్పించబడ్డాయి. సర్పంచులు తమ బాధ్యతలను గుర్తించి ఐదేళ్ల పాటు చిత్తశుద్ధితో పనిచేస్తే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చు. కేవలం అధికారం కోసం కాకుండా, గ్రామాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి.**

– అక్షరటుడే, భీమ్‌గల్



# ప్రథమ పౌరుడి బాధ్యతతో పల్లెబాగు..!

- ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్‌లు
- పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాల్సిన సమయమిది..

పంచాయతీలకు పన్నులు వసూలు చేసే అధికారం రాజ్యాంగం కల్పించింది. స్థానిక సంస్థలకు ఇవే ప్రధాన ఆదాయ వనరులు. వీటిని సక్రమంగా సేకరించినప్పుడే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. గ్రామానికి ఎన్నికైన సర్పంచ్‌లు తమ పాలకవర్గం సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాల్సి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంటుంది.

### గ్రామానికి ఆదాయ మార్గాలివే..

గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్ను. ఈ పన్నులకు పక్కాగా సేకరిస్తే గ్రామాభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్నెళ్లకొకసారి ఇంటి పన్ను, ప్రతినెలా వసూలు చేసే కుళాయి బిల్లులు, విద్యుత్ స్తంభాలు, ముఖద్వారాలు, కూడళ్లలో ఏర్పాటు చేసే ప్రకటనల ద్వారా ఆదాయం సమకూరుతుంది. అలాగే గ్రామ పరిధిలోని ఇతర వ్యాపార సంస్థల నుంచి ఫీజులు, సంతల వేలం, అక్కడ జరిగే క్రయ విక్రయాల ద్వారా వచ్చే ఫీజులు కూడా వస్తుంటాయి.

### నిర్మాణ అనుమతులు..

ముఖ్యంగా గ్రామాల్లో నిర్మించుకునే భవనాలకు సంబంధించి కూడా ఫీజుల ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుంది. అక్రమ నిర్మాణాలపై విధించే జరిమానాలు సైతం వస్తుంటాయి. ఇక కేబుల్ టీవీ ఫీజులు, చేపల చెరువుల వేలం, కంపోస్టు ఎరువుల తయారీ, అమ్మకం, ఇసుక క్వారీల ద్వారా కూడా ఆదాయం సమకూరుతుంది.

### కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు..

కేంద్ర ఆర్థిక సంఘం కేటాయించే నిధులు, సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన, ఉపాధి హామీ పథకం, ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు కూడా వస్తాయి. వీటిని పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రణాళికతో వినియోగించాల్సి ఉంటుంది.

### రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులు..

వృత్తి పన్ను, లోకల్ సెస్, స్టాంప్ డ్యూటీ, వినోదపు పన్నులో వాటా ద్వారా కూడా జీపీకి ఆదాయం వస్తుంది. సీనరేజ్ ఫీజులు, మెజిస్టీరియల్ రుసుములు కూడా వస్తాయి. అలాగే రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, ఉత్తమ పంచాయతీలకు ఇచ్చే ప్రోత్సాహకాలు వస్తాయి. వీటిని నూతనంగా ఎన్నికైన సర్పంచులు పాలనపై పట్టు సాధించి, సొంత ఆదాయ వనరులను పెంచుకుంటూ ప్రభుత్వ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తేనే గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తాయి.


### జిల్లా గణాంకాలు...

| | |
|---|---|
| మొత్తం రెవెన్యూ మండలాలు | 33 |
| గ్రామ పంచాయతీలు | 545 |
| వార్డు సభ్యుల సంఖ్య | 5,022 |
| సగటు వార్డుల సంఖ్య ఒక్కో జీపీకి | 8 నుండి 12 వరకు.. |

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి




**అక్షరటుడే, ఆర్మూర్ :** మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆర్మూర్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ కంచెట్టి గంగాధర్ పిలుపునిచ్చారు. బీజేపీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల ముందస్తు సమావేశాన్ని శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. ఓటర్ లిస్ట్‌లోని తప్పులు, బోగస్ ఓట్లను ప్రక్షాళన చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంపై చర్చించారు. స్థానికంగా లేని ఓటర్లను గుర్తించి వెంటనే వాటిని తొలగించే విధంగా కార్యచరణ మొదలు పెట్టాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలెపు రాజు, కార్యదర్శి పోల్కం వేణు, మాజీ ఫ్లోర్ లీడర్ ఆకుల శీను, ధ్యాగ ఉదయ్, నాయకులు తిరుపతి నాయక్, కందీశ్ ప్రశాంత్, జాగిర్దర్ శీను, సుంకరి రంగన్న, ఆకుల రాజు, బాండ్లపల్లి నర్సిరెడ్డి, బ్యావత్ సాయి కుమార్, విజయ్ ఆనంద్, కుక్కునూరు లింగన్న, పిట్ల శ్రీధర్, ఉదయ గౌడ్, శేఖర్, పులి యుగంధర్, కుమార్, అల్జాపూర్ రాజేష్, మిరియాల కిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పట్టపగలే రెండిళ్లలో చోరీ..

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో దొంగలు పట్టపగలే రెచ్చిపోయారు. శుక్రవారం మధ్యాహ్నం ఇద్దరు ఉద్యోగుల ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బాధిత కుటుంబాలు, పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ కాలనీలో వైద్యశాఖలో పనిచేసే బాలునాయక్, గర్గుల్‌లో పంచాయతీ సెక్రెటరీగా పనిచేస్తున్న శోభ దంపతులు నివాసం ఉంటున్నారు. ఉదయమే ఇద్దరు విధులకు వెళ్లారు. అనంతరం మధ్యాహ్నం శోభ ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో ఆమె కంగారుపడి ఇంట్లోకి వెళ్లి చూడగా.. దుండగులు ఆమెను చూసి డోర్ వెనుక గుండా పారిపోయారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. అలాగే కామారెడ్డిలోని అదే కాలనీలో గల మరో ఇంట్లోనూ దొంగలు చోరీకి పాల్పడ్డారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న వెన్నెల ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ రెండు ఘటనల్లో పంచాయతీ సెక్రెటరీ ఇంట్లో 5 తులాల బంగారం, నగదు, వెన్నెల ఇంట్లో 30 తులాల వెండి, రూ.50 వేల నగదు దుండగులు దోచుకెళ్లినట్టుగా బాధితులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్‌లో చెలరేగిన మంటలు..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలోని పులాంగ్ వద్ద బైక్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అప్రమత్తంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. పులాంగ్ ప్రాంతంలోని వంశీ ఇంటర్నేషనల్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్‌లో నుంచి ఓ వ్యక్తి బైక్‌పై బయటకు వస్తూ రోడ్డుపై వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రోడ్డుపై వెళ్తున్న బైక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బైక్‌పైన ఉన్న వ్యక్తి పక్కకు దూకేశాడు. అనంతరం అప్రమత్తమైన పెట్రోల్ బంక్ సిబ్బంది అగ్నిమాపక యంత్రం ద్వారా మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనతో కొద్దిసేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించింది.



## ఈవ్‌టీజింగ్ చేస్తే షిటీంకు సమాచారమివ్వాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా.. ఈవ్‌టీజింగ్ చేసినా షీటీంకు సమాచారం ఇవ్వాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఆర్మూర్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆర్మూర్ సబ్ డివిజన్ షీటీం సభ్యులు విగ్నేష్, సుమతి ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినుల పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. షీటీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీటీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం కాంచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## ఆర్మూర్ టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయంలో నూతనంగా వచ్చిన గ్రామ పరిపాలన అధికారులకు సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కె శశికాంత్ రెడ్డి, కార్యదర్శి ఎన్ విశాల్, సబ్ కలెక్టర్ ఆఫీస్ డీఏవో విక్రమ్, కార్యవర్గ సభ్యులు వికాస్, దిలీప్, సాయి, నవీన్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



## రెవెన్యూ సహాయకుడికి ఘన సన్మానం

**అక్షరటుడే, ముప్కాల్:** వేంపల్లి గ్రామానికి చెందిన గ్రామ రెవెన్యూ సహాయకుడు సుంకరి మల్లేష్ కొన్నేళ్లుగా గ్రామానికి సేవలందించి గురువారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని మల్లేష్ సేవలను కొనియాడారు.




## 9న రోటరీ క్లబ్ మెగా వైద్య శిబిరం

**అక్షరటుడే, ఇందూరు:** రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 9న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు శ్యాంసుందర్ అగర్వాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్డులో ఉన్న క్లబ్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యశిబిరం బోధన్ బస్టాండ్ సమీపంలో ఉన్న రోటరీ కృత్రిమ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి గోవింద్ జవహర్, కోశాధికారి జుగల్ జాజు, మాజీ అధ్యక్షుడు జగదీశ్వరరావు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** పోలీస్ శాఖ, ఆర్మూర్ రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలో వానదారులకు అవగాహన కల్పించారు. అంబేడ్కర్ చౌరస్తా, మామిడిపల్లి చౌరస్తా, ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లలో ట్రాఫిక్ నియమ నిబంధనలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంవీఐ రాహుల్ కుమార్, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్, ఎస్సై రఘుపతి, ఏఎంవీఐలు రోహిత్ రెడ్డి, సాగర్, వర్ష, సిబ్బంది పాల్గొన్నారు.